www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 23 మార్చి 2024

5

ఏలూరు

మెనూ బోర్డులో నేతల ఫొటోలు తొలగింపు

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ బోర్డులోని ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకూ తెలియజేయడం జరిగిందని, ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఉల్లంఘన జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించామని డిఇఒ అబ్రహం తెలిపారు.

దొందూ.. దొందే..!

- వైసిపి, టిడిపి ప్రభుత్వాల తీరుతో 'చింతలపూడి' బాధిత రైతులు గగ్గోలు
- ఎన్నికల్లో ఓట్ల కోసం రైతులకు మోసపూరిత హామీలు
- అధికారంలోకొచ్చాక రైతుల గోడుపట్టని పాలకులు
- రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం పరిహారం ఇవ్వాలంటున్న రైతులు
- ఈ ఎన్నికల్లో నేతలు ఏం చెబుతారో

చింతలపూడి ప్రాజెక్టు కాలువ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు టిడిపి, వైసిపి చేసిన ద్రోహం గురించి ఎంత చెప్పినా తక్కువే. రైతులను మోసగించడంలో రెండు పార్టీలూ దొందూ.. దొందే అన్నట్లుగా వ్యవహరించాయి. ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతంలో అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటి. 2008లో ఈ ప్రాజెక్టు ప్రారంభమైనా ఇప్పటికీ పూర్తి కాలేదు. తొలుత రూ.1,700 కోట్ల అంచనాలతో దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకం రూపుదిద్దుకుంది. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా రూ.4,909 కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించింది. ఇక్కడ వరకూ బాగానే ఉంది. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో మాత్రం టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో బహిరంగ మార్కెట్లో ఎకరా ఖరీదు రూ.30 లక్షలకుపైగా ఉండగా చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.12 లక్షలు, రూ.15 లక్షలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రెండెకరాల భూమి కోల్పోయిన రైతులు తిరిగి ఎకరా పొలం కూడా కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందని, పట్టిసీమ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చినట్లు ఎకరాకు రూ.30 లక్షల వరకూ పరిహారం ఇవ్వాలని రైతులు ఆందోళన బాట పట్టారు. రోజుల తరబడి నిరవధిక దీక్షలు సాగించారు. అప్పట్లో చింతలపూడి ఎంఎల్ఎగా ఉన్న పీతల సుజాత మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఎంపీ మాగంటి బాబు ఇలా అందరినీ కలిశారు. అనేకసార్లు అమరావతికి సైతం వెళ్లి అధికారులను, ఇతర నాయకులను కలిసి తమగోడు చెప్పుకున్నారు. ప్రభుత్వం పరిహారం పెంపులో ససేమిరా అంటూ భీష్మించుకుని కూర్చుంది. తిరిగి తిరిగి రైతుల అలసిపోయారు.

వైసిపి నమ్మించి వెన్నుపోటు..

పరిహారం కోసం రైతులు చేస్తున్న ఆందోళనకు అప్పట్లో వైసిపి నాయకులు మద్దతు పలికారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. చింతలపూడి, కామవరపుకోట ఇలా బాధిత రైతులు ఉన్న గ్రామాలన్నీ వైసిపి నాయకుల మాటలు నమ్మారు. ఎన్నికల సందర్భంగా చింతలపూడి ప్రధాన సెంటర్లో జగన్ బహిరంగ సభ జరిగింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక చింతలపూడి రైతులకు పరిహారం సమస్య తీరుస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో రైతుల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు రెండు చింతలపూడి రైతులకు తీరని నష్టం చేకూర్చాయి.

పదేళ్లుగా భూములున్నా లేన్నట్టుగా రైతుల పరిస్థితి

ప్రాజెక్టు కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో పిల్లల వివాహాలకు ఉపయోగించుకునేందుకు గానీ, ఆరోగ్య, ఆర్థిక సమస్యలు వస్తే భూములు అమ్ముకోవడానికి గానీ వీల్లేకుండా పోయింది. 2014లో భూమి రిజిస్ట్రేషన్ వాల్యూను బట్టి పరిహారం ఎక్కువగా ఇవ్వడం కుదరదంటూ ప్రభుత్వం మెలిక పెట్టింది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ వాల్యూ పెరిగింది. ఆ ప్రకారం పరిహారం ఇస్తే చాలన్నట్లు రైతులు చెబుతున్నారు. రైతుల న్యాయమైన కోరికను కూడా తీర్చని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పొలాలను నిషేధిత జాబితాలో చేర్చడంతో ఎటువంటి పనులూ చేసేందుకు వీల్లేకుండా పోయింది. చింతలపూడి ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో గడిచిన ఖరీఫ్‌లో చెరువు నీరు చాలక కరువు ఆవహించి పంట పొలాలు దెబ్బతిన్న పరిస్థితి ఉంది. అదే విధంగా పామాయిల్ చెట్లకు ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు ఇస్తున్నట్లు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు మోసం చేయడంతో మరోసారి ఎన్నికల్లో ఈ పార్టీలు రైతులకు ఏవిధమైన హామీ ఇస్తాయో వేచిచూడాలి. దీనిపై రైతులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి. వచ్చే ప్రభుత్వమైనా చింతలపూడి రైతులకు న్యాయం చేస్తుందో.. లేదోననే అనుమానం నెలకొంది.

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మహేష్ యాదవ్

వైసిపి, టిడిపి ఒకే సామాజిక తరగతి అభ్యర్థులకు టిక్కెట్

ఏలూరు ఎంపీ టిక్కెట్ తమకే అంటున్న బిజెపి నాయకులు

మహేష్ యాదవ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎట్టకేలకు ఏలూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థిపై ఉత్కంఠ వీడింది. టిడిపిలో ముఖ్యనాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్ యాదవ్‌ను టిడిపి ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం టిడిపి అధిష్టానం ప్రకటించింది. ఆయన స్వస్థలం కడప జిల్లా. గతంలో టిడిపి ఛైర్మన్‌గా పనిచేసిన పుట్టా సుధాకర్ కుమారుడే మహేష్ యాదవ్. పుట్టా మహేష్ యాదవ్ ఇప్పటి వరకూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనలేదు. వ్యాపారవేత్తగా ఉన్నారు. తొలిసారిగా ఎంపీగా పోటీచేస్తున్న పరిస్థితి. వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించింది. ఏలూరు పార్లమెంట్ పరిధిలో యాదవ సామాజిక తరగతి ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో అదే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థి కోసం టిడిపి రకరకాల వడపోతలు చేపట్టింది. కామవరపుకోటకు చెందిన గోరుమచ్చు గోపాల్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. తర్వాత తెలంగాణలో పోలీస్ అధికారిగా పనిచేస్తున్న సత్యనారాయణ గౌడ్ పేరు ప రిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగింది. చివరకు పుట్టా మహేష్‌యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఒకే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులు ఎంపీగా పోటీచేస్తుండటంతో ఏలూరు పార్లమెంట్ స్థానంలో పోటీ హోరాహోరీగా ఉండే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

'తపన' చౌదరికి ఏలూరు ఎంపీ సీటుపై పోరాటం ఆగదు

బిజెపి నాయకుల ధిక్కార స్వరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఎంపీ స్థానం తపన చౌదరి, గారపాటి సీతారామంజనేయ చౌదరికి ఇచ్చే వరకూ పోరాటం ఆగదని బిజెపి నాయకులు ధిక్కార స్వరం పెంచారు. ఏలూరు జిల్లాలో శుక్రవారం అశోక్ నగర్‌లో ఉన్న బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉండవల్లి వెంకటరావు కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాట్లాడుతూ బిజెపి టిడిపి జనసేన పొత్తుల్లో భాగంగా ఏలూరు పార్లమెంట్ సీటును టిడిపికి కేటాయించడం చాలా దురదష్టకరమన్నారు. ఏలూరులో టిడిపి పార్లమెంట్ సీటు ప్రకటించినప్పటికీ బిజెపి హై కమాండ్ నుంచి తమకు ఎటువంటి సమాచారం లేదని కేంద్రంలో ఇంకా మంతనాలు జరుగుతున్నాయన్నారు. నామినేషన్ వేసే వరకు సమయం ఉందని సీతారామాంజనేయ చౌదరికి సీటు వచ్చే వరకూ పోరాడుతామన్నారు. రాష్ట్ర అభివద్ధి కోసం దేశ అభివద్ధి కోసం పొత్తు పెట్టుకుంటున్నామని చెప్పి టీడీపీ సీటు ప్రకటించడం చాలా దురదష్టకరమన్నారు. బిజెపితో పొత్తు ఉంటేనే కానీ భవిష్యత్తు ఉందనుకున్న పార్టీలు ఈ రోజు పొత్తు కుదిరిన తర్వాత వారు ఇష్టాన్ని సారం సీట్లు ప్రకటించడం అన్యాయమని అన్నారు. ఆ పార్టీ నాయకులు గాడి రాంబాబు మాట్లాడుతూ టిడిపి పార్టీ ప్రకటించిన సీట్లనే జాతీయ పార్టీ అంగీకరించడం రాష్ట్రంలో బిజెపి పార్టీ నాయకత్వ వైఫల్యం అని అన్నారు . గెలిచే సీట్లను టిడిపి ఉంచుకొని వారికి అభ్యర్థులు లేని చోట బీజేపీకి సీట్లు ఇవ్వడం చంద్రబాబు యొక్క ఎత్తుగడలు అని, చంద్రబాబు జిత్తుల మారి నక్క యొక్క ఎత్తుగడలు అని చెప్పొచ్చున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారికి సీట్ కేటాయించడం లోకల్ వారికి కేటాయించకపోవడం అన్యాయమని ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కనుక పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఏలూరు పార్లమెంట్ సీటు సీతారామాంజనేయ చౌదరికి కేటాయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ అధ్యక్షులు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంసిసి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఎటువంటి ఉల్లంఘనలకు తావులేకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సి.విజిల్, కంట్రోల్ రూమ్ నిర్వహణ, ప్రతికూల వార్తలపై చర్యలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తరువాత జిల్లాలో అమలవుతున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి సందర్భంగా తీసుకోవాల్సిన, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఎంసిసి ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సి.విజల్ ద్వారా ఫిర్యాదు చేసిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని వారు చేసిన ఫిర్యాదులను పరిశీలించి విచారణ చేపట్టి తగు చర్యలు చేపట్టాలన్నారు. సి.విజల్ నమోదైన ఫిర్యాదులకు వంద నిమిషాల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతికూల వార్తలను పరిశీలించి వాటిపై నిర్దిష్టమైన సమయంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద ఎస్ఎస్‌టి టీమ్‌లు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వివిధ రాజకీయ. ప్రచార కార్యక్రమాల అనుమతులు నిమిత్తం సువిదా యాప్, ఎన్ కోర్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్దిష్ట కాలంలో అనుమతులు జారీ చేయాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా లౌడ్ స్పీకర్లు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, తదితర వంటివి వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన విషయాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. సమావేశంలో ట్రైయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఓ డి.పుష్పమణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, కె.అద్దయ్య, వై.భవానిశంకరీ, కె.భాస్కర్, కలెక్టరేట్ ఎఒ కె.కాశీ విశ్వేశ్వరరావు, నోడల్ అధికారులు ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, జిల్లా పరిశ్రమల మేనేజరు ఆదిశేషు, ఎంసిసి నోడల్ అధికారులు జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంల ఆకస్మిక బదిలీపై విచారణ జరపాలి

మాట్లాడుతున్న డివిఎన్‌విడి ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న 16 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఎన్నికల నోటిఫికేషన్ రోజు అకస్మాత్తుగా, అన్యాయంగా బదిలీ చేసిన సంఘటనపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. 16 మంది నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బందిలో ఎలాంటి హెచ్చరిక లేకుండా 14 మందిని ఏలూరులో ఇతర యుపిహెచ్‌సిలకు, మరొక ఇద్దరిని చింతలపూడికి బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఎటువంటి టిఎలు, బదిలీ అలవెన్సులు, హెచ్‌ఆర్‌ఎలులేవని, అందువల్ల బదిలీలు చేసే అవకాశం లేదని, అయితే ఏలూరులో మాత్రమే జిల్లా అధికారులు ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని అన్నారు. యూనియన్‌గా మూడేళ్ల నుంచి పరస్పర, ఐచ్చిక బదిలీలకు అవకాశం కల్పించమని కోరుతున్నా, ప్రభుత్వం కాంట్రాక్టు సిబ్బందికి ఆ సౌకర్యం కల్పించలేదన్నారు. ఏలూరులో జిల్లా అధికారులు నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారం బదిలీలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు యుపిహెచ్‌సిలను పరిశీలన చేసిన సందర్భంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరి చేసేందుకే బదిలీలు చేస్తున్నట్లుగా బదిలీ ఉత్తర్వుల్లో తెలపడం హాస్యాస్పదమన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వీటిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో జిల్లా కార్యాలయానికి ఇష్టానుసారం డిప్యూటేషన్లు వేశారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా, జిల్లా అధికారులు వాటిని ఉల్లంఘించి మన జిల్లాలో ఇష్టం వచ్చినట్లుగా డిప్యూటేషన్లు వేశారన్నారు. ఈ అక్రమాలపై వెంటనే విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు నాయకురాలు ఎస్.కె సుభాషిని పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలి

స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస విశ్వనాథ్

ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రానున్న ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని, దాని అమలులో భాగంగా జిల్లాలో అన్ని వర్గాల ఓటర్లతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కమీషనర్ ఎస్.వెంకట కృష్ణ ఆధ్వర్యంలో స్వీప్ అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులతో పాటు నిర్లక్ష్యానికి గురైన వర్గం, బతుకుదెరువు కోసం కాగితాలు, గుడ్డలు ఎరుకొని జీవిస్తున్న వారితో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ మే 13న జరిగే ఓటింగ్‌లో జిల్లాలో మొత్తం ఓటర్ల 16,25,655 మంది పాల్గొనాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం పోలింగ్ కేంద్రాల దగ్గర అన్ని సదుపాయాలు కల్పించిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో జిల్లా పోలింగ్ శాతం 83.75 సాధనంగా నమోదైందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం పోలింగ్ శాతం 86.86శాతం, దెందులూరు పోలింగ్ 85.14 శాతం, ఏలూరు పోలింగ్ శాతం 68.10, పోలవరం పోలింగ్ శాతం 86.92, చింతలపూడి పోలింగ్ శాతం 81.82, నూజివీడు పోలింగ్ శాతం 86.69, కైకలూరు పోలింగ్ శాతం 88.05 నమోదయ్యిందని అన్నారు. మెరుగైన ఓటింగ్ సౌలభ్యత కోసం, సమగ్రమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడంలో వికలాంగులు (పిడబ్ల్యుడి), 85 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఓటర్లు ఇప్పుడు వారి ఇళ్ల నుంచి ఓటు వేసే అవకాశం కల్పించడం జరుగుతుందని డిపిఒ తెలిపారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లు 1,743 ఉంటే 409 పోలింగ్ స్టేషన్‌లో రాష్ట్ర పోలింగ్ శాతం కన్నా తక్కువ పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. ఇప్పటికే పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా సన్నాహాలు జరిగాయని, దానిలో భాగంగా జిల్లా స్థాయి, మండల, గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు మహిళా సంఘాలు, కాలేజీ విద్యార్థులు, గిరిజనులు, వికలాంగులు, మాజీ సైనికులు, ఉద్యోగులు, ఉపాధిహామీ వేతనదారులు, భవిష్యత్ ఓటర్లతో ఇలా అనేక వర్గాల వారితో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రానున్న ఎన్నికలు ఇవిఎం ద్వారా జరగనున్న సందర్భంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరగడంతో పాటు, ఏథికల్ ఓటింగ్ జరగాలని ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా వారు సమకూర్చిన అప్లికేషన్లపై కూడా ఓటర్లకు అవగానా కల్పించడం జరిగిందని, దానిలో భాగంగా ముఖ్యమైన ఐటి అప్లికేషన్లు, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, సి-విజిల్ యాప్, సువిధ యాప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్, వికెవైసి యాప్ తదితర సాంకేతిక అంశాలపై కూడా ఓటర్లకు అవగాహన కల్పించడం జరిగిందని డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఎన్నికల వ్యయ పరిమితులు ఉన్నందున పార్లమెంట్ సభ్యులు తరపు వ్యయ పరిమితి రూ.95 లక్షలు, అసెంబ్లీ తరపు వ్యయ పరిమితి రూ.40 లక్షలు ఉన్నందున పరిమితులు లోబడి ఖర్చు చెయ్యాలని అన్నారు. సదస్సుకు అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు. వారందరితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు.

'పది' పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

డిఇఒ ఎస్.అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదోతరగతి పరీక్షలలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు శుక్రవారం నమోదైందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లెక్కల పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు మొదలైన నాలుగవ రోజు శుక్రవారం లెక్కల పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు 24,133 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 23,451 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 682 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరి హాజరు శాతం 97.17గా నమోదైందని, ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన ప్రయివేట్ విద్యార్థులు 5,781 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 3,682 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 2,099 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 139 పరీక్ష కేంద్రాలలో 47 పరీక్ష కేంద్రాలు లైవ్ స్క్వాడ్ తనిఖీచేయగా జిల్లాస్థాయి అబ్జర్వర్ ఆరు పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఐదు పరీక్ష కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 5 పరీక్ష కేంద్రాలు తనిఖీచేయగా మొత్తం జిల్లావ్యాప్తంగా 63 పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు. అంతేకాకుండా జిల్లాలోని ముదినేపల్లిలోని సహాయ మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఒక విద్యార్థి పట్టుబడ్డాడని తెలిపారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి, డీబార్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

వేసవిలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవి కాలం ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అజాగ్రత్తగా ఉంటే అధిక వేడి వల్ల ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవింద రావు ప్రజలకు సూచించారు. ఏలూరులోని వెంకటాపురం-2 రామానగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ అధిక వేడి వలన మన శరీరంలో ఉండే నీరు చెమట రూపంలో బయటికి పోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తీవ్రమైన వడదెబ్బ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడం, డీహైడ్రేషన్‌కు గురవడం, వాంతులు అవడం, ఆయాసపడి నీరసించుకుపోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవాలంటే 12 గంటల్లోపు పనులు ముగించుకోవడం, మరలా నాలుగు గంటల తర్వాత పనులు చేయడం, ఎక్కువగా ద్రవపదార్థాలైన కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఒఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం, తలకు తలపాగా, టోపీ, గొడుగు వాడడం చేయాలన్నారు. ఎక్కువగా వడదెబ్బకు వయసులో పెద్దవారు, గర్భిణులు, చిన్నపిల్లలు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి వారు ప్రత్యేకమైన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అలాగే వేసవికాలంలో సాధారణ జ్వరాలు కూడా వచ్చే అవకాశం ఉందని, మనకి ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మంచి నీటి నిల్వ ప్రాంతాలలో పెరుగుతాయి కాబట్టి వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలని ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రమేష్, ఆరోగ్య కార్యకర్త సుమతి, ఎంఎల్‌హెచ్ పి.నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు రాణి, కోటేశ్వరి పాల్గొన్నారు.

వసతిగృహాల్లో నేతల ఫొటోలు తొలగించాలి

సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్

ఏలూరు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో రాజకీయ నాయకుల ఫోటోలను తొలగించడం జరిగిందని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ తెలిపారు. ఈమేరకు ఈనెల 16వ తేదీన జిల్లాలోని సంక్షేమ శాఖాధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఉల్లంఘించినట్లైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. దినసరి ఆహార పట్టికలో కూడా ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుల ఫొటోలు మూసివేయడం జరిగిందని తెలియజేశారు.

పోలవరం: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో నాలుగవ రోజు పది పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పోలవరం మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులకు 116 మంది విద్యార్థులు, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది విద్యార్థులు, కచేరి వద్ద సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 138 మంది విద్యార్థులకు 90 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, మూర్తి తెలిపారు.

కొయ్యలగూడెం: మండల కేంద్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో శుక్రవారం జరిగిన లెక్కలు(మాథ్స్) పరీక్షకు 1038 మంది హాజరైయ్యారని మండల విద్యాశాఖాధికారి జె.సురేష్ బాబు తెలిపారు. మండలంలో ఉన్న అన్ని పరీక్ష కేంద్రాలలో మొత్తం విద్యార్థులు 1,239కి గాను 1038 మంది హాజరైయ్యారన్నారు. 201 మంది గైర్హాజరయ్యారని తెలియజేశారు.

కలిదిండి : పదవ తరగతి గణిత శాస్త్రం పరీక్షకు 1049 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలైన ఆరుతెగల పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 216 మందికి 191 మంది, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 328 మందికి 324, శశి హై స్కూల్‌లో 94 మందికి 75, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 267 మందికి 253, క్రాంతి హై స్కూల్‌లో 73 మందికి 56, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 157 మందికి 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తం 1,135 మంది విద్యార్థులకు 1049 మంది హాజరు కాగా 86 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రభాకర బాబు తెలిపారు.

గుండెపోటుతో టిడిపి నేత మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చీకటి చెన్నారావు(47) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం రాత్రి చింతలపూడిలోని జిమ్ములో సాధన చేస్తూ ఉండగా గుండెపోటుకు గురికావడంతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, పుచ్చకాయల నోబుల్ రెడ్డి, మరిడి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన స్వగృహానికి వెళ్లి, మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సొసైటీకి వైసిపి రంగులు తొలగింపు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని వ్యవసాయ సొసైటీకి గతంలో వేసిన వైసిపి రంగులను అధికారులు శుక్రవారం తొలగించారు. ఇటీవల ఈ రంగులపై జనసేన ఆధ్వర్యాన అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు నూజివీడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనానికి వేసిన వైసిపి రంగులకు బదులు మరో రంగులను వేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి నియమ నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు జనసేన నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండల పరిధిలో ఎన్నికల నియమావళి అమలవుతున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు అందరూ అధికారులకు సహకరించాలని నూజివీడు మండల తహశీల్దార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్‌లను తొలగించడం జరిగిందన్నారు. ఎలాంటి ప్రచారాలకైనా ముందుగా మైక్, వాహనాలకు సంబంధించిన ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని ప్రచారాలపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

28 నుంచి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాలలో ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆల్ ఇండియా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి ఎందరో అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశానుసారం 2024-25 సంవత్సరానికి గాను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా ఆధ్వర్యంలో 2024 మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వివిధ క్రీడాంశాలలో వేసవి క్రీడా శిక్షణా శిభిరాలను 8 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాల బాలికలకు నిర్వహించుటకు నిర్ణయించడమైనదని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలలో పనిచేయుచున్న క్రీడాశిక్షకులు, అనుభవజ్ఞులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులను కోరడమైనదన్నారు. అందుకు అవసరమైన క్రీడా సామాగ్రి, నిర్వాహణా ఖర్చులు, శిక్షణ ఇచ్చు శిక్షకులకు గౌరవ వేతనం కూడా ఇవ్వబడునన్నారు. కావున అన్ని వివరాలతో దరఖాస్తులను ఈనెల 28వ తేదీ లోపు స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో వ్యక్తిగతంగా గాని, పోస్ట్ ద్వారా గాని అందజేయాలని ఆయన కోరారు. ఈ వేసవి క్రీడా శిక్షణా శిబిరాల కార్యక్రమంలో శిక్షకులుగా ఎంపికకాబోవు వారు 8 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాల బాలికలను స్థానికంగా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలోని మీర్జాపురం గ్రామంలో శుక్రవారం ప్రధాన రహదారి వద్ద గోగినేని శిరోమణి(66) వృద్ధురాలిని కారు ఢీకొంది. హైవే మొబైల్ పోలీసులు శివరామకృష్ణ, కోటేశ్వరరావు తీవ్ర గాయాలైన వృద్ధురాలిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు విజయవాడకు రిఫర్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మద్యం బాటిల్స్ అక్రమ విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బండివారిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం బాటిల్స్ కలిగి ఉండి వాటిని అధిక రేటుకి అమ్ముతుండగా తన సిబ్బందితో దాడి చేసి పట్టుకుని అతని వద్ద నుంచి ఆరు విస్కీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిర్లక్ష్యంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు!

ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలం పుట్లగట్లు గూడెంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనులు చేపట్టుటకు పుట్లగట్ల గూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్లడానికి దారి మళ్లించడం జరిగింది. నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్స్, అధికారులకు రోడ్డు మీద నీళ్ల చల్లాలనే విషయం 15, 20 రోజులకు గుర్తుకురావడం హాస్యాస్పదం. ఒకవేళ నీళ్ల చల్లితే మట్టి రోడ్డు అంతా బురదమయంగాను, వాటర్ చల్లకపోతే దుమ్ము, ధూళి మయంగా మారి వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుపై నీళ్ల చల్లడం వల్ల బురదమయమై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దుమ్ము, ధూళి వల్ల పంటసాలపై దుమ్ముతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ ఫీల్డ్ అధికారులు, కాంట్రాక్టుల నిర్లక్ష్య పూర్వకంగా వ్యవహరించటం వల్లే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు తెలియజెప్పి ఇటువంటి దుమ్ము, ధూళి లేకుండా, బురదమయంగా మార్గం లేకుండా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా తూతు మంత్రంగానే జరిపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దుమ్ముమయంగా రోడ్డు

తడిసిన రోడ్డు..

పదేళ్లలో బిజెపి చేసిందేమీ లేదు..!

కేజ్రీవాల్ అరెస్టుకు కాంగ్రెస్ ఫోరం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ ఇండియా పోరం వేదిక సభ్యులు ఏలూరు కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజానాల రాంమోహన్ రావు, సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్‌లు మాట్లాడుతూ కేంద్రలో బిజెపి గత 10 సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమీ అమలు చేయలేదన్నారు. నోట్ల రద్దుతో ప్రజలను ఇబ్బందుల పాలు చేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, కరెంటు, గ్యాస్ తదితర ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిసారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులు హరిస్తుందన్నారు. దీంతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని తెలిపారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలను ఏదోరకంగా కేసులు పెట్టి ఇరికిస్తుందని అన్నారు. బిజెపి ఇప్పటి వరకు కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో గవర్నర్‌లతో రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేసిందన్నారు. ఈ క్రమంలో ఇండియా పోరం పార్టీలు ఏకమై ఎన్నికల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. ఇండియా పోరంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా కూటమి బలహీనపరచాలని బిజెపి చూస్తుందని విమర్శించారు. ఈ సందర్భంగా వారంతా కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. బిజెపి ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పోరం పార్టీలను ఏదోరకంగా ఇరికిస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అకౌంట్‌లు ఫ్రీజ్ చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రచారానికి కూడా డబ్బులు లేకుండా చేయాలని చూస్తుందన్నారు. దీన్ని ప్రజలంతా ఖండించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు దాశరధి, ఆంజనేయరాజు, నారాయణరావు, బాషా, ఇస్మాయిల్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, సాదే బాబు ప్రసాద్, సిపిఎం నాయకులు జె.గోపి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఇండియా వేదిక సభ్యులు

ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ని విస్తృతపర్చాలి

నైట్ పెట్రోలింగ్‌పై దృష్టి పెట్టాలి

సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగాన్ని మరింత విస్తృతస్థాయిలో మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాలతో ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ విధానంపై జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు, ఇతర గిఫ్ట్స్ పంపిణీని పూర్తిగా నిరోధించేందుకు రాత్రిపూట గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. జిల్లా సరిహద్దులు, చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్‌ల తనిఖీలు మరింత పెరగాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయపార్టీలు లేదా అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సీజర్ మేనేజ్ మెంట్‌కు అనుబంధంగా పనిచేస్తున్న అధికారులంతా మరింత చురుగ్గా పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. రాజకీయపార్టీల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలపై వీడియో చిత్రీకరణ పక్కాగా ఉండాలన్నారు. అనుమతి పొందిన ప్రచారాన్ని రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని అన్నారు. కొత్త హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతులు లేవని పాతవాటికి సంబంధించి నిర్మాణాలను ఆర్అండ్‌బి వారు పరిశీలించిన పిదప అనుమతులు ఇవ్వాలన్నారు. సువిధ ఎన్ కోర్ యాప్‌లు ద్వారా ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించి అనుమతులకోసం వచ్చే దరఖాస్తులను ఆర్ఒలు 12 గంటల లోపు పరిష్కరించడమో, సరైన రీతిలో లేకపోతే తిరస్కరించడమో చేయాలేతప్పా వాటిని పెండింగ్‌లో ఉంచేందుకు ఎంతమాత్రం వీలులేదని ఆయన స్పష్టం చేశారు. నాటుసారా, అక్రమమద్యం, రవాణా సరఫరాకు సంబంధించి దాడులను ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద నియమించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండి తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాల్లో మద్యం, నగదు, పూర్తిస్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే జిల్లా సరిహద్దులు, చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని రూ.50 వేలపైన నగదు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన పిమ్మట తగుచర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి వినియోగించే వాహనాలకు సంబంధించి అనుమతుల్లో వాహనం నెంబరు, కేటాయించిన సమయం తదితర వివరాలను అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, సబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఎఫ్ఒ శైలజ, జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని శ్రీకాకుళం క్యాంపస్ గేట్-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌జియుకెటి విద్యార్థులను వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.విజయకుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నింటా ప్రతిభ కనబరుస్తూ బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రతిభతో ట్రిపుల్ ఐటీ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకన్న

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పంతగాని వెంకన్న నియమితులయ్యారు. పార్టీ ఆఫీసు నుంచి ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. చింతలపూడి నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంతగాని వెంకన్న ప్రస్తుతం లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెంకన్నకు వైసిపి నాయకులు, కార్యకర్తలు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

జనసేన అభ్యర్థులను గెలిపించాలి

కొఠారు ఆదిశేషు

ప్రజాశక్తి - దెందులూరు

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఏలూరు అశోక్ నగర్‌లోని దెందులూరు నియోజకవర్గ జనసేన కార్యాలయంలో నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పార్టీ అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలను ఉద్దేశించి ఆదిశేషు మాట్లాడుతూ జనసేన, టిడిపి, బిజెపి కూటమి బలపరిచిన దెందులూరు అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో జనసేన మరింత బలోపేతం చేసేందుకు నియోజకవర్గస్థాయిలో గ్రామ, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో టిడిపి, బిజెపిలకు మద్దతుగా నిలబడ్డారని, ఆయన సూచనలను తప్పకుండా పాటించి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పాటించాలి

ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ హక్కులు, నైతిక విలువలు మానవుని మనుగడకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తాయని ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు తెలియజేశారు. సర్ సిఆర్ రెడ్డి కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మానవ హక్కులు - నైతిక విలువలు' అనే అంశంపై వాల్యూయాడెడ్ కోర్సు బిఎ విద్యార్థులకు ప్రారంభించబడింది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సభకు సభాధ్యక్షులుగా ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు వ్యవహరించారు. అనంతరం గౌరవ అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో నైతికవిలువలు, హక్కుల గురించి తెలుసుకోవడం వల్ల విద్యార్థులు ప్రగతిపథంలో పయనిస్తారని తెలియజేశారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ హక్కులు, నైతిక విలువలు మనిషి జీవితంలో మంచి మార్పులు తీసుకువస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎమ్.శ్రీనివాసరావు, ఆర్.కేశవ, కె.చంద్రశేఖర్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

నూజివీడు డిఎస్‌పి లక్ష్మయ్య

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించటంతో పాటు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు పర్చుటంలో సంబంధిత అధికారులు అంకితభావంతో పనిచేయాలని నూజివీడు డిఎస్‌పి గోలి లక్ష్మయ్య కోరారు. ఆగిరిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంసిసి అమలు, సి-విజిల్ ద్వారా ఆన్‌లైన్ ఫిర్యాదు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచటం, చెకింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంల పనితీరులపై మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, మహిళా పోలీసులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.మృత్యుంజయరావు, ఎంపిడిఒ పి.శామ్యూల్, ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సాయి బాలాజీ థియేటర్‌లో 'అనన్య' సందడి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరంలో స్థానిక సాయి బాలాజీ థియేటర్‌లో అనన్య సినిమా రిలీజ్ సందర్భంగా నటులు సాయికుమార్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సినిమాలో నటించిన నటులందరికీ శుభాభినందనలు తెలియజేశారు. సినిమాలో విలన్ పాత్ర పోషించిన జ్వాలా రాజేష్ థియేటర్‌ని సందర్శించి సందడి చేశారు. ఈ సందర్భంగా విలన్ పాత్రధారి రాజేష్ మీడియాతో మాట్లాడుతూ అనన్య సినిమా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగిందన్నారు. తాను ఏలూరు వాసిని అని, తమ సినిమాను ఆదరించాలని కోరారు. సినిమా హీరో జుత్తిగ జయరాం కూడా ఏలూరు వాస్తవ్యులేనని తెలిపారు. తాను సినిమా కుటుంబ పరంగా కామెడీ, హర్రర్, ప్రేమ తదితర అంశాలతో కూడి ఉందన్నారు. సినిమా పిల్లలతో పాటు యువతను, మహిళలను కుటుంబ పరంగా అందరినీ ఆనందపరుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా సినిమాలో ముఖ్యపాత్రలో హీరో సుమన్, జబర్దస్త్ కమెడియన్లు పాల్గొన్నారని, హీరోయిన్ చందన చక్కని అభినయంతో అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. అందరూ సినిమాను చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా సినీ ప్రేక్షకులను విజ్ఞప్తి చేశారు. జాతీయ మాల మహాసేన అధ్యక్షులు అలగా రవికుమార్ మాట్లాడుతూ అనన్య సినిమా అందర్నీ అలరిస్తుందన్నారు. ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరారు.

సార్వత్రిక ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాటించవలసిన నియమ నిబంధనలపై సిఐ రాజేష్, ఎస్ఐ జ్యోతిబసు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పేరంపేట గ్రామంలో జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్, జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు పేరంపేట గ్రామాల ప్రజలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం సిఐ మాట్లాడుతూ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును నిర్భయంగా, పక్షపాతాలు లేకుండా, ప్రలోభాలకు గురికాకుండా, ప్రశాంతమైనటువంటి వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ వారు తీసుకున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలియజేశారు.

ఆటో, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

మానవత్వం చాటుకున్న డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు గాయాలపాలైన సంఘటన పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ వెంకటాపురం చెరుకు ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగింది. సిఐ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం దొండపూడి నుంచి వస్తున్న సర్వీసు ఆటోని పోలవరం నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఆటోలో పోలవరం ఆసుపత్రికి వెళుతున్న పేషెంటు, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలపాలయ్యారు. దీంతో అదే మార్గాన వెళుతున్న డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి, సిఐ మధుబాబు తమ వాహనాన్ని ఆపి గాయలపాలైన వారిని మరో వాహనంలో పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

షర్మిల నాయకత్వాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎంఎల్ఎ బాడిస దుర్గారావు తనయుడు బాడిస బొజ్జిదొర శుక్రవారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డిని కలిశారు. షర్మిలా రెడ్డి బొజ్జిదొరను పార్టీ కండువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బొజ్జిదొర మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని, షర్మిలారెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని పార్టీ నాయకులకు హామీ ఇచ్చారు.

చిన్నంపేటలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎం.సంఘమిత్ర ఆశ్రమ హాస్పిటల్ ఏలూరు, సిహెచ్.ప్రవీణ్ చంద్ర నూజివీడు వైద్యులు పాల్గొని 365 మంది వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగాకుమారి, ఇఒపిఆర్‌డి పి.మురళీకృష్ణ, గ్రామ సర్పంచి పరస ధనలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎ.శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ఒ జివి.రమణ, గ్రామ కార్యదర్శి నాగరాజు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - ముసునూరు

భక్తి శ్రద్ధలతో ప్రజలు ప్రార్థనలు చేపట్టినట్లయితే మానవత విలువలకు గౌరవం పెరుగుతుందని ఫాధర్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రమణక్కపేట విచారణ పరిధిలోని నెహ్రూనగర్ నిష్కళంక మాత ఉత్సవాల్లో రెండోవ రోజు వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఫాదర్ రాజశేఖర్, జాన్‌భారతి, పులపాక జాకబ్ ప్రసాద్‌లచే ముసునూరు, రమణక్కపేట, కాట్రేనీపాడు గ్రామాల ప్రజలకు ఉపదేశం చేశారు. జోసఫ్ తంబి, జోయ్ అమల్ సమిష్టి బలిపూజ కార్యక్రమంలో తెలగతోటి రాజారావు ఫాదర్ గురువులచే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

'ఏలూరు ఎంపీ సీటు బిజెపికి కేటాయించాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఏలూరు ఎంపీ సీటు బిజెపికి కేటాయించాలని మండల బిజెపి నాయకులు కేంద్ర బిజెపి పెద్దలకు, రాష్ట్ర నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు మండలంలోని తిరుమలదేవిపేటలో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ టిడిపి, జనసేన పొత్తులో భాగంగా బిజెపికి ఎంపీ సీటు కేటాయించాలన్నారు. గత 16 సంవత్సరాలుగా తపన ఫౌండేషన్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి, ఐదారు సంవత్సరాలుగా అత్యంత శ్రమిస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరికి ఏలూరు ఎంపీ సీటు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పివిఎస్ఎస్ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి విజయమే లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి విజయమే లక్ష్యంగా పనిచేస్తామని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కందుల రమేష్ తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కన్నా దళిత జాతి ప్రయోజనాలు ముఖ్యమని రమేష్ తెలియజేశారు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా సమావేశం ఏలూరు లంకపేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుల రమేష్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్విరామంగా పోరాటం చేస్తున్నామని, వర్గీకరణకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏవిధంగా కూడా సహకరించలేదన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం అమలు చేసిన 26 రకాల రుణాలను సైతం జగన్మోహన్ రెడ్డి రద్దుచేసి దళితులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను ప్రపంచవ్యాప్తంగా గౌరవిస్తున్నప్పటికీ సిఎం జగన్మోహన్ రెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పేరును మార్చి జగనన్న విదేశీ విద్య పేరు పెట్టి అవమానించారన్నారు. జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మాదిగలందరం కలిసి ఓడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తనగాల శేఖర్, చౌటపల్లి విజయ, విస్సన్నపల్లి సిద్ధు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన పెద్దిశెట్టి శివన్నారాయణ, S/o. రామమూర్తి అను నేను 2023 జనవరి నెలలో మోటార్ సైకిల్‌పై కైకరం నుండి ఉంగుటూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క M 977341 నెంబర్ గల పాస్‌పోర్టు జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు.

గుత్తికొండ శ్రీనివాసరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 98480 50089